క్లుప్తంగా

కాలువలను పరిశీలించిన ఆర్డీఓ



మొవ్వ: మండలంలోని వేములమడ శివారు కుంపటివాని గూడెం వద్ద భీమ నదీ డ్రెయిన్, కోసూరులోని భీమనది చానల్, మొవ్వలోని మేడూరు చానల్‌ను ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, జలవనరుల శాఖ అధికారులతో కలిసి డ్రెయిన్, కాలువలను సందర్శించి జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ పనుల వివరాలను సేకరించారు. భీమ నది డ్రెయిన్‌లో తూటుకాడ తొలగింపు, పూడికతీత, తూముల ఏర్పాటు, షట్టర్ల నిర్మాణ పనులు జరగనున్నాయని, వీటిని పూర్తి చేయడానికి మరో నాలుగు నెలల గడువు ఉందని ఆర్డీఓకు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

ఉచితంగా ప్రసూతి సేవలు

మొవ్వ: మండలంలోని కూచిపూడి గ్రామంలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్న ఉచిత ప్రసూతి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి నిర్వాహకులు సూచించారు. జనవరి ఒకటో తేదీ నుంచి 365 మంది గర్భిణులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని ప్రకటించారు. ఈ నెల ఒకటో తేదీ వరకు 175 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మరో 190 మంది గర్భిణులకు కూడా ఉచిత సేవలు అందించనున్నారు. పేర్ల నమోదు, ప్రతి నెలా వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, సాధారణ కాన్పులు, సిజేరియన్, ఆపరేషన్ అనంతర సేవలను ఉచితంగా అందిచనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 91219 01919, 91219 02929 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గుడివాడరూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ అనగాని వెంకటరమణ గురువారం తెలిపారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్ శక్తులకు మేలు


గుడివాడరూరల్: కార్పొరేట్ శక్తులకు, విదేశీ పెట్టుబడుదారులకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.సి.పిరెడ్డి విమర్శించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి వర్గాలపై పన్నుల భారం మోపుతూ సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ఉందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పేదలకు ఈ బడ్జెట్ వల్ల ఒరిగింది ఏమీ లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మురాల రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



వానపాముల(పెదపారుపూడి): విద్యార్థులు నుంచే ర్యాంగింగ్ దూరంగా ఉంటే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవచ్చని ఎస్ఐ పల్లా నాగ కల్యాణి సూచించారు. ర్యాగింగ్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని వానపాముల హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైతే విద్యార్థుల జీవితం అంధకారం అవుతుందన్నారు. సైబర్ నేరాలు, ర్యాంగింగ్‌పై విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ర్యాంగింగ్‌పై విద్యార్థినులు ముందుకొచ్చి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ అప్పారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను కాపాడుకోవాలి



మండవల్లి: కొల్లేరు సరస్సు ప్రాంత చిత్తడి నేలలను కాపాడుకుంటేనే భావితరాలకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. జాతీయ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అయ్యవారిరుద్రవరంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో చిత్తడి నేలల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు, సర్పంచ్ బోనం శేషగిరిరావు మాట్లాడుతూ.. కొల్లేరు సరస్సు చిత్తడి నేలలకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో కొత్త వెలుగులు



బొడ్డపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ప్రజాప్రతినిధులు



కలిదిండిలో సంక్షేమ పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

- ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, డీఎన్నార్
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

తోట్లవల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనతో పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాయని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బొడ్డపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఉత్సాహంగా జరిగింది. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించడంతోపాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి గడచిన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను పంపిణీ చేశారు. గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా..

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకే పరిమితమైన సంక్షేమ పథకాలు నేడు కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు అందుతున్నాయని వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ఏర్పాటుతో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మూడే శివశంకర్, ఆరేపల్లి శివరామకృష్ణ (రాము), ఎంపీటీసీ సభ్యులు దారం రోజారాణి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, నాయకులు నడకుదురు రాజేంద్ర, గోపిశెట్టి ఫణికుమార్, దారం నాగగోపి, పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు (కలిదిండి): అభివృద్ధి, సంక్షేమం ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న, ఎంపీటీసీ సభ్యుడు మహమ్మద్ సఫాయితుల్లా ఆధ్వర్యంలో కలిదిండి సచివాలయం -1 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలకు ఎమ్మెల్యే కరపత్రాలను పంపిణీ చేశారు.

మాట తప్పని నైజం సీఎం సొంతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డీఎన్నార్ కొనియాడారు. మాట తప్పని నైజం ఆయన సొంతమన్నారు. గత పాలనలో జన్మభూమి కమిటీలు సిఫార్సులు చేసిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు దక్కేవని గుర్తుచేశారు. నేడు పూర్తి పారదర్శకతతో అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు నంబూరి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, పీఏసీఎస్ అధ్యక్షురాలు ఊర కల్యాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, సర్పంచుల సంఘ అధ్యక్షుడు గద్దె ఆనంద్‌కుమార్, నాయకులు మండ నవీన్, జీవరత్నం, కందుల వెంకటేశ్వరరావు, నీలపాల భోగేశ్వరరావు, బుర్ల విష్ణు, కరేటి భాస్కర్, ఎండీ సర్దార్‌బాబు, సోమేశేఖర్, తహసీల్దారు తేజోమణి, ఎంపీడీఓ సీతారాంకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలి



ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

తమ్మలంపాడు(పెదపారుపూడి): జగనన్న కాలనీలో త్వరతగతిన ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తే వెంటనే బిల్లులు వచ్చేలా కృషి చేస్తామని ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి సూచించారు. మండలంలోని తమ్మలంపాడులో ఇళ్ల నిర్మాణ పనులపై లబ్ధిదారుల ఇళ్లకు అధికారులు శుక్రవారం వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సకల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మించుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి పాల్గొన్నారు.

'మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి'

గుడివాడటౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ అసెంబ్లీ సీట్లలో సగం మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య కోరారు. స్థానిక శోభన హోటల్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, ఎస్సీ కార్పొరేషన్ నిధులను మూడు కార్పొరేషన్లకు కేటాయించాలని, పార్లమెంట్ కొత్త భవనానికి సంతరావిదాసు గురూజీ పేరు పెట్టాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయ కులు కంచెర్ల సుధాకర్, సాల్మన్, గజని, చినసత్యానందం, మావిళ్ల రవి, కొడాలి బాలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించండి

ఎమ్మెల్యే డీఎన్నార్



దివ్యాంగుల శిబిరంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులతో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రత్యేక అవసరాల గల చిన్నారులను ప్రేమతో ఆదరించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సూచించారు. స్థానిక భవిత సెంటర్‌లో ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ డి.రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఉపకరణాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఈఆర్టీ జిల్లా కోఆర్డనేటర్ బి.భాస్కరరాజు మాట్లాడుతూ.. ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ద్వారా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 240 మంది ప్రత్యేక అవసరాలుగల చిన్నారులను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ జహీర్, నాయకులు భట్రాజు శివాజీ, చెరుకువాడ బలరామరాజు, పట్టణ సీఐ నాగరాజు, కంటి వైద్య నిపుణులు విజయ్, ఫిజియోథెరిపిస్టులు రాధారాణి, సునీత, కామరాజు, ఐఈఆర్టీలు జి.వెంకటలక్ష్మి, వి.రాంబాబు, అరుణకుమారి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యత

అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్



విజేతలకు బహుమతులు అందిస్తున్న రేంజర్ శ్రీనివాస్ తదితరులు

కైకలూరు: చిత్తడి నేలల పరిరక్షణ అందరి బాధ్యతని అటవీశాఖ రేంజర్ జె.శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఆటపాక పక్షుల కేంద్రం వద్ద విద్యార్థులకు గురువారం పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రామ్‌సర్ సైట్‌గా రెండు తెలుగు రాష్ట్రాల్లో గుర్తించిన ఏకైక ప్రాంతం కొల్లేరు అని చెప్పారు. ఈ ఏడాది చిత్తడి నేలల పునరుద్ధరణ అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భారతదేశంలో ఇప్పటి వరకు రామ్‌సర్ జాబితాలో 75 చిత్తడి నేలలు చేరాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2002 ఆగస్టు 19న కొల్లేరు సరస్సును రామ్‌సర్ సైట్‌గా గుర్తించారని తెలిపారు. పీఎంజేఎఫ్ లయిన్ ఆర్.వి.ఎస్.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో చిత్తడి నేలలు కీలక భూమిక పోషిస్తాయన్నారు. లోకుమూడి, నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రాజెక్టరు ద్వారా చిత్తడి నేలల ఆవశ్యకతను వివరించారు. చిత్తడి నేలలపై అటవీ శాఖ సిబ్బంది ప్రదర్శించిన ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఈడీసీ చైర్మన్ వడ్లాని సుబ్బారావు, డీఆర్వో జె.వి.వి.ప్రకాష్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు రామ్ మోహన్‌సింగ్, కరీం, ఫారెస్టు బీటు ఆఫీసర్లు కె.వెంకన్న, జె.నరసింహ, రాజ్‌కుమార్, రాజేష్, కృష్ణంరాజు, రత్నంరాజు, జి.శ్రీనివాసరావు, అసిస్టెంటు బీటు ఆఫీసర్లు జె.పుష్పాంజలి, వై.సౌజన్యకుమార్, జి.రమాకాంత్, వై.లాజర్, ఎం.చిట్టిబాబు, బేస్ క్యాంపు సిబ్బంది, ఉపాధ్యాయులు టి.వి..హరిబాబు, అనిల్‌కుమార్, అశోక్‌కుమార్, పి.నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సుధారాణి పాల్గొన్నారు.

విజేతలు వీరే..

చిత్రలేఖనంలో కైకలూరు నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎ.నోమిక, పి.భవ్య సాయి దీపిక, సీహెచ్.మహేష్, డిబెట్‌లో అపూర్వ (లోకుమూడి), జి.సిద్ధు (లోకుమూడి), జి.హేమశ్రీ (కైకలూరు), వ్యాసరచనలో కె.కీర్తిశ్రీ (కైకలూరు), బి.అపూర్వ (లోకుమూడి), ఆర్.లలిత (కైకలూరు) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు.

పింఛనుతో పేదలకు ఆసరా



వెంకటేశ్వరరావుకు రూ.10 వేలు అందజేస్తున్న సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీడీఓ సుధాప్రవీణ్

పమిడిముక్కల: రాష్ట్ర ప్రభుత్వం ఠంఛనుగా వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తూ లబ్ధిదారులకు ఆసరాగా నిలుస్తోందని ఎంపీడీఓ సుధాప్రవీణ్ అన్నారు. మండలంలోని తాడంకి సచివాలయాన్ని ఎంపీడీఓ గురువారం సందర్శించారు. సచివాలయ రికార్డులను తనిఖీచేశారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో కిడ్నీ సంబంధిత సమస్యలతో డయాలసిస్ చేయించుకుంటున్న ఆరెపు వెంకటేశ్వరరావుకు కొత్తగా మంజూరైన రూ.10 వేల పింఛన్‌ను సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి శ్రీలక్ష్మితో కలిసి అతని ఇంటికి వెళ్లి ఎంపీడీఓ అందజేశారు. వెంకటేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిన బ్రోచర్‌ను అందజేసి ధైర్యం చెప్పారు. పంచాయతీ కార్యదర్శి బి.సునీత, సచివాలయ కన్వీనర్ కూచిపూడి వీరాస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ స్రవంతి, డిజిటల్ అసిస్టెంట్ కృష్ణమోహన్, వలంటీరు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల అందజేత



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

పామర్రు: అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సూచన మేరకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేశామని పామర్రు ఉప సర్పచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఒకటో వార్డులోని శ్యామలాపురానికి చెందిన జాన్ నివసించే ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దుస్తులు, గృహోపకరణాలు, సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు కాలి బూడిదై జాన్ కుటుంబ సభ్యులు నిరాశ్రయులుగా మారారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, నిత్యావసర సరుకులు, దుస్తులతో పాటు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వార్డు మెంబరు వెంకటేశ్వరరావు, మద్దుల సుబ్రహ్మణ్యం, నందిపు వెంకట నాంచారయ్య, ఏసుబాబు, నందిరాజు తదితరులు పాల్గొన్నారు.

కొర్లపాడు ఎంపీపీ స్కూల్‌లో సామర్థ్యాల పరీక్ష



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న హెచ్ఎం రమేష్, లింగాల కాంప్లెక్స్ చైర్మన్ సుబ్రహ్మణ్యం

మండవల్లి: మండలంలోని కొర్లపాడు ఎంపీపీ స్కూల్‌లో గురువారం టీచింగ్ ఆల్‌రైట్ లెవెల్ కార్యక్రమం నిర్వహించారు. మూడు నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల్లో గణితం, తెలుగు సబ్జెక్టుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ వివరాలను విద్యా సంబంధిత యాప్‌లో లింగాల కాంప్లెక్ సీఆర్పీ టి.సుబ్రహ్మణ్యం అప్లోడ్ చేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.

10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండవల్లి: ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) అధ్యక్షతన ఈ నెల పదో తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ పి.మల్లీశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

ప్రారంభమైన సైన్స్ ఎక్స్‌పో



విద్యార్థుల సైన్స్ ప్రదర్శన తిలకిస్తున్న రవాణా శాఖ అధికారి సీతాపతిరావు

గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సైన్స్ ఎక్స్‌పో ప్రారంభమైంది. జిల్లా రవాణా శాఖ అధికారి పి.సీతాపతిరావు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తియ్యడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం కళాశాలలో క్రీడలను ఆయన ప్రారంభించారు. సైన్స్ ప్రదర్శనలకు సంబంధించి 25, ఆహారానికి సంబంధించి పది స్టాళ్లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం.నాగు, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.రాజు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్ర మెడికల్ హాస్పిటల్స్ విజయవాడ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. అధ్యాకులు, అధ్యాపకేతర సిబ్బంది మొత్తం 160 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హెచ్.వి.ప్రసాదరావు, ఆస్పత్రి వైద్యులు అచ్యుతబాబు, రమేష్, సాగర్, రాణి, విజయపుష్ప, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు



పెనమకూరులో అయోడిన్ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిప్రసన్న

తోట్లవల్లూరు: అయోడిన్ సాల్ట్ వినియోగం ఆరోగ్యానికి ఎంతో మంచిదని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. జాతీయ అయోడిన్ లోపరుగ్మతల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెనమకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, దక్షిణ ఎస్సీవాడ మండల పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం అయోడిన్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆరు నుంచి 12 ఏళ్ల వయసు బాల బాలికలు 90 మందికి అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, ఆరోగ్య సిబ్బంది రామానుజేశ్వరి, సురేఖ, రత్నం తదితరులు పాల్గొన్నారు.



పునాది దశలో ఇంటి నిర్మాణం



శ్లాబు దశలో ఉన్న ఇంటి నిర్మాణం



పూర్తయిన జగనన్న గృహ నిర్మాణం

వేగంగా జగనన్న గృహ నిర్మాణాలు

మండవల్లి: మండలంలో జగనన్న గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 417 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. మరో 735 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. శ్లాబ్ దశలో 55 ఇళ్లు ఉన్నాయి. 41 మంది శ్లాబ్‌లు పూర్తి చేశారు. 221 గృహాలు బేస్‌మెంట్ లెవల్‌లో, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ.1.80 లక్షల నగదు, నాలుగు ట్రక్కుల ఇసుక ఉచితంగా అందజేస్తోంది. బస్తా రూ.260 చొప్పున 90 బస్తాల సిమెంట్‌ను పంపిణీచేస్తోంది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చకచకా పూర్తిచేస్తున్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



గుడివాడటౌన్: స్థానిక సత్యనారాయణపురంలోని భవిత కేంద్రానికి చెందిన దివ్యాంగుల పాఠశాల చిన్నారులకు గురువారం ఉపకరణాలు పంపిణీ చేశారు. గుడివాడ ఎంపీపీ గద్దే పుష్పరాణి ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుకలో భాగంగా దివ్యాంగులకు ఈ ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా పుష్పరాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్రశిక్ష కృష్ణాజిల్లా ద్వారా ఈ ఉపకరణాలను సరఫరా చేశామన్నారు. ఏడు వీల్ చైర్లు, రెండు సీపీ చైర్లు, రెండు వినికిడి యంత్రాలను పంపిణీచేశామని వివరించారు. ఎంఈఓ శేఖర్ సింగ్, జెడ్పీటీసీ సభ్యుడు జి.రామకృష్ణ, భవిత కేంద్ర నిర్వాహకులు ఎం.కె.నీలాంబరం, రాములు తదితరులు పాల్గొన్నారు.